# ప్రొటోకాల్ పాటించండి..

- కాంగ్రెస్ నాయకులకు మంత్రి సీతక్క సూచన



అధికారికంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు నరేశ్ జాదవ్, కంది శ్రీనివాస్‌రెడ్డి(వృత్తంలో)

జైనథ్, డిసెంబర్ 28 : ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని జామినిలో ప్రజాపాలన ప్రారంభించడానికి వచ్చిన ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ కార్యదర్శి నరేశ్ జాదవ్‌ల దూకుడుతనాన్ని నివారించారు.

# సికిల్‌సెల్ పరీక్షలు నిర్వహించాలి..

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 28 : సికిల్‌సెల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కొలాంగూడ గ్రామంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ.. దంతన్‌పల్లి పీహెచ్‌సీ పరిధిలోని ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. వ్యాధి ఉన్న వారికి మెరుగైన వైద్యం, సలహాలు, సూచనలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు అనురాధ, వైద్యుడు ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి

# అర్హులకు పథకాలు అందజేస్తాం



జైనథ్ మండలంలోని జామిని గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క

జైనథ్, డిసెంబర్ 28 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన విధంగా అర్హులకు ప్రభుత్వ పథకాలను అందజేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజాపాలనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని జామిని గ్రామంలో గురువారం ఐదు గ్యారెంటీలకు దరఖాస్తులను గిరిజనుల నుంచి స్వీకరించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. ప్రతి పథకం లబ్ధిదారుడికి చేరే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జామిని గ్రామానికి మొదటిసారిగా వచ్చిన సీతక్కకు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఆమెను ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ అరుంధతి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త, డీఆర్డీవో కిషన్, డీపీవో పీ శ్రీనివాస్, జైనథ్ ఎంపీడీవో వీ గజానన్‌రావ్, ఏవో వివేక్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఇంద్రశేఖర్, సర్పంచ్ కాంతాబాయి పాల్గొన్నారు.



జామిని గ్రామంలో పాల్గొన్న గ్రామస్తులు, దరఖాస్తుదారులు

# నిర్లక్ష్యం వద్దు..

- నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



నిర్మల్ అర్బన్ : కౌంటర్లను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మల్ అర్బన్/సోన్, డిసెంబర్ 28 : రాష్ట్ర ప్రభుత్వం అందించే పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. గురువారం నిర్మల్ పట్టణంలోని నాయుడివాడ కాలనీ.. నిర్మల్ మండలంలోని అక్కాపూర్, ముఠాపూర్.. సోన్ మండలంలోని సాకెర, లెఫ్ట్ పోచంపాడ్, కౌట్ల(కె) గ్రామాల్లో పర్యటించారు. ప్రజాపాలన కేంద్రాలను పరిశీలించారు. అన్ని పథకాలకు ఒకే దరఖాస్తు అందజేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచామని, ప్రజల రద్దీని దృష్టిలో ఉంచుకుని కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. అధికారులు పారదర్శకంగా అర్జీలు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, కమిషనర్ రాజు, జిల్లా విద్యుత్ శాఖ అధికారి జయంత్‌రావు చౌహాన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తులు**

| జిల్లా | వచ్చినవి |
|---|---|
| ఆదిలాబాద్ | 18,492 |
| నిర్మల్ | 16,640 |

## ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ, అదనపు కలెక్టర్

తాంసి, డిసెంబర్ 28 : ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి పరిశీలించారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి గ్రామంలో ఏర్పాటు చేసిన దరఖాస్తు కేంద్రాలను సందర్శించారు. దరఖాస్తుదారులు తప్పులు లేకుండా ఫారం పూర్తి చేసి అధికారులకు అందించాలని సూచించారు.

# ప్రజాపాలన పరేషాన్

## ఐదు గ్యారంటీలకు ఒకటే దరఖాస్తు

- రేషన్ కార్డు లేనోళ్ల విషయంలో కొరవడిన స్పష్టత
- అధికారుల అస్పష్టతతో విస్తుపోయిన ప్రజలు
- పింఛన్ కోసం మరోసారి అప్లికేషన్ ఇవ్వాలేమోనని వచ్చి ఇబ్బందులు పడ్డ వృద్ధులు
- మొదటి రోజు కనిపించని సందడి

మంచిర్యాల, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల అమలులో భాగంగా చేపట్టిన 'ప్రజాపాలన' ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. కాకపోతే రేషన్ కార్డు లేనోళ్లు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చా? రేషన్ కార్డు ఉన్నోళ్లే చేసుకోవాలా? అనే విషయంపై అధికారులు ఒక్కొక్కరూ ఒక్కో తీరు సమాధానమివ్వడంపై ప్రజలు పరేషాన్ అవుతున్నారు. రేషన్ కార్డు ఉంటేనే గ్యారెంటీలకు అర్హులని, రేషన్‌కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని భిన్న ప్రకటనలు రావడంతో క్లారిటీ లేకుండా పోయింది. రేషన్ కార్డు లేదు దరఖాస్తు చేసుకోవచ్చా? అన్న ప్రశ్నకు అధికారుల నుంచి రకరకాల సమాధానాలు వచ్చాయి. ''రేషన్ కార్డు లేదని మేము రాసుకుంటామని.. మీరు దరఖాస్తు చేసుకోండని కొందరు అధికారులు చెబుతుండగా.. మీరిచ్చే దరఖాస్తులో రేషన్ కార్డు లేదని రాసి ఇవ్వండని మరికొందరు.. రేషన్ కార్డు లేదని లేఖ రాసి దరఖాస్తుకు జత చేయండని ఇంకొందరు..'' ఇలా ఎవరికి తోచినట్లు వారు చెబుతుండడంతో దరఖాస్తు చేసేందుకు వచ్చిన వాళ్లంతా విస్తుపోవాల్సి వస్తున్నది. ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధి పొందుతున్న వారు మళ్లీ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలా.. అవసరం లేదా.. అనే విషయంలోనూ క్లారిటీ లేకుండా పోయింది. ఆసరా పింఛన్ల విషయంలో మాత్రమే అప్లికేషన్‌లో (ప్రస్తుతం పింఛన్ పొందుతున్న వారు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు) అని స్పష్టంగా పేర్కొన్నారు. కొన్ని చోట్ల పింఛన్లు వస్తున్నప్పటికీ మరోసారి దరఖాస్తు చేసుకోవాలి కావచ్చని వచ్చిన వృద్ధులను అధికారులు తిరిగి పంపించేయడం కనిపించింది. దీంతో వృద్ధులు కాస్త ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

**మండలానికి రెండు బృందాలు..**

ప్రతి మండలానికి రెండు బృందాల చొప్పున ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించేందుకు వచ్చాయి. ఒక్కో బృందం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మరో గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించాయి. మున్సిపాలిటీల్లో వార్డుకు ఒక కౌంటర్ చొప్పున ఏర్పాటు చేశారు. ప్రతి వార్డుకు ఒక వార్డు ఆఫీసర్, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. ఆరు వార్డులకు కలిపి ఒక సూపర్‌వైజర్, నాలుగు వార్డులకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలిరోజు ప్రతి మండలంలో నాలుగు గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించడం పూర్తయ్యింది. దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రేషన్ కార్డు జిరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వెంట తెచ్చుకోవాలని అధికారులు చెబుతున్నారు. కొన్ని మండలాల్లో రెండు గ్రామాలు ఒక పంచాయతీగా ఉన్న దగ్గర కాస్త ఇబ్బంది ఏర్పడింది. పంచాయతీ మొత్తానికి ఒకే బృందం రావడంతో రెండు, మూడు కిలోమీటర్లు పోయి దరఖాస్తులు ఇవ్వాల్సి వచ్చింది. తొలిరోజు ప్రజాపాలన నిర్వహించిన గ్రామాలన్నీ తక్కువ జనాభా ఉన్నవి కావడంతో ఇబ్బందులు ఏర్పడలేదు. జన సందడి తక్కువగా కనిపించింది. రానున్న రోజుల్లో దరఖాస్తు చేసుకునేందుకు చాలా మంది వచ్చే అవకాశాలు ఉన్నాయి. అప్పటి వరకైనా దరఖాస్తు విషయంలో అధికారులు ఓ క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది.



**మా ఊర్లో కౌంటర్ పెడితే ఈ గోస తప్పేది..**

*చెన్నూర్ రూరల్, డిసెంబర్ 28 : నా పేరు పోసక్క. మాది అక్కెపల్లి గ్రామం కింద ఉండే శివలింగాపూర్. ఇండ్లు, పింఛన్లు కావాల్సినోళ్లు దరఖాస్తులు చేసుకొమ్మని చెప్పిన్రు. గందుకే అక్కెపల్లికి నడుసుకుంట (కిలోమీటర్) వచ్చిన. నాకు పింఛన్ వస్తలేదు. ఫారం నింపించి సార్లకు ఇచ్చిన. మా ఊరిలో కౌంటర్ పెడితే నాకు ఈ గోస తప్పేది.*

# 'ప్రజాపాలన' ప్రారంభం

- ఐదు గ్యారెంటీల కోసం దరఖాస్తుల స్వీకరణ
- జైనథ్ మండలంలోని జామినిలో పాల్గొన్న మంత్రి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

ఆదిలాబాద్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ) : అభయహస్తం కింద ఐదు గ్యారెంటీల అమలులో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన కార్యక్రమం గురువారం ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులతోపాటు 17 మండలాల్లోని పలు గ్రామాల్లో అధికారులు అర్జీలు స్వీకరించారు. మహిలక్ష్మి, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం కౌంటర్లు ఏర్పాటు చేయగా.. ప్రజలు దరఖాస్తులు అందజేశారు. దరఖాస్తు ఫారాలతోపాటు రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్, ఫొటోతో జత చేసి అందించారు. వీరికి అధికారులు రశీదులు ఇచ్చారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పట్టణంలోని రణదీవనగర్, గాంధీనగర్‌లో దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొలిపుర పాఠశాల, మహాలక్ష్మి వాడ పాఠశాల, తాంసి మండలంలోని వడ్డాడి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ఇంకా అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, శ్యామలాదేవిలు పలు సందర్శించారు.

# శాంతి భద్రతలే లక్ష్యం

- అందరి సహకారంతోనే ఎన్నికలు, పండుగల నిర్వహణ
- నిర్మల్ జిల్లాలో 4.90 శాతం తగ్గిన నేరాలు
- వార్షిక నేర నివేదికను వెల్లడించిన ఎస్పీ ప్రవీణ్‌కుమార్




వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ప్రవీణ్‌కుమార్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 28 : నిర్మల్ జిల్లాలో శాంతిభద్రతలే ధ్యేయంగా ముందుకెళ్తామని, నేరాల నియంత్రణకు కృషి చేస్తామని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని పోలీసుశాఖ కార్యాలయంలో నిర్వహించిన వార్షిక నేర నివేదికలోని అంశాలను వెల్లడించారు. 2022 సంవత్సరంలో 3,120 కేసులు నమోదు కాగా.. 2023 సంవత్సరంలో 2,967 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. దాదాపు 4.90 శాతం కేసులు తగ్గాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవడంతో ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన 7,632 మందిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపడంతోనే ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, 59 మందికి జైలు శిక్ష కూడా విధించామన్నారు. జిల్లాలో భార్యాభర్తల మధ్య గొడవలు అధికమయ్యాయని, ఈ ఏడాది 121 కేసులు నమోదు చేశామని గుర్తు చేశారు. మహిళలకు సంబంధించిన అన్ని రకాల కేసులు 309కి చేరాయని తెలిపారు. గంజాయి రవాణాను అరికట్టడంతో సఫలం అయ్యామని, కేవలం ఐదు కేసులు మాత్రమే నమోదయ్యాయని అన్నారు. 436 మిస్సింగ్ కేసులు నమోదు కాగా.. కేవలం 20 మంది ఆచూకీ మాత్రమే లభించిందని పేర్కొన్నారు. మహిళలపై 18 పోక్సో కేసులు నమోదయ్యాయి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద 13 కేసులు అయ్యాయన్నారు. పేకాట శిబిరాలపై దాడి చేసి 98 కేసులు నమోదు చేసి 605 మందిని అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి రూ.15.48 లక్షలు సీజ్ చేశామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న 271 మద్యం షాపులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. 17 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. రూ.1.38 కోట్ల నగదు దొంగతనానికి గురి కాగా రూ.5.62 లక్షల నగదును రికవరీ చేశామని తెలిపారు. వివిధ కేసుల్లో 40 మందికి జైలు శిక్ష పడింది. ఇందులో ఆరుగురికి జీవితకాలం, 12 మందికి ఐదేండ్లకు పైబడి, 19 మందికి ఐదేండ్ల లోపు శిక్ష పడిందని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో ఏఎస్పీ క్రాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ వీరన్న, డీఎస్పీ గంగారెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సైన్స్ సెంటర్ కలేనా?

## కేంద్రంలోని బీజేపీ సర్కారు మోకాలడ్డు

- ఐదెకరాల స్థలాన్ని కేటాయించిన కేసీఆర్ ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలంటున్న మేధావులు
- విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా నిధులు మంజూరు చేయాలి..




నిర్మల్ శివారులో కేసీఆర్ ప్రభుత్వం సైన్స్ సెంటర్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నిర్మల్, డిసెంబర్ 28(నమస్తే తెలంగాణ) : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, శాస్త్ర, సాంకేతిక రంగాల అభిరుచులను వెలికి తీసేందుకు, నూతన ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేయ తలపెట్టిన సైన్స్ సెంటర్, ప్లానిటోరియంపై నీలినీడలు కమ్ముకున్నాయి. నిర్మల్ శివారులోని చించోలి(బి) ఆర్టీవో కార్యాలయ సమీపంలో మూడేండ్ల క్రితమే కేసీఆర్ సర్కారు ఐదెకరాల స్థలం కేటాయించింది. పరిపాలన అనుమతులు ఇచ్చి, రూ.50 కోట్లు మంజూరు చేసింది. ప్రధానంగా నిధులను కేంద్ర శాస్త్ర, సాంకేతిక అభివృద్ధి శాఖ కేటాయించాలి. కానీ.. ఇప్పటివరకు అనుమతులు, నిధులు ఇవ్వకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. హైదరాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన సైన్స్ సెంటర్ కోసం 25 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తేనే.. నిర్మల్‌లో సైన్స్ సెంటర్‌కు అనుమతులు, నిధులు మంజూరు చేస్తామని కేంద్రం మెలిక పెట్టినట్లు సమాచారం. అప్పటి అటవీ, పర్యావరణ, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కూడా కేంద్ర ప్రభుత్వానికి, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి కిషన్‌రెడ్డికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విద్యావేత్తలు, మేధావులు కోరుతున్నారు. వందలాది మంది విద్యార్థుల సృజనాత్మకత బయటకు రానుంది. సహజ వనరులను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలోని వేలాది మంది విద్యార్థులు పొరుగు రాష్ర్టాలు, విదేశాలకు వెళ్లి స్టార్టప్‌లు స్థాపిస్తున్నారు. వీరు స్థానికంగా సెంటర్ ఏర్పాటు చేస్తే స్టార్టప్‌లు ఏర్పడే అవకాశం ఉంది. ప్రధానంగా బాసరలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు పరిశోధన కేంద్రంగా కూడా మారే అవకాశం ఉంది.

**శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి లబ్ధి**



*ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలో ఆదివాసులు అధికంగా ఉన్నారు. ఇక్కడి విద్యార్థులు హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతానికి వెళ్లి బిర్లా సైన్స్ ప్లానిటోరియం లాంటివి చూడలేరు. కాబట్టి ఇక్కడ సైన్స్ సెంటర్ ఏర్పాటైతే వారికి అనువుగా ఉంటుంది. మూఢ నమ్మకాలు తొలిగిపోయే వీలుంటుంది.*

**- ఏ రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్**

# దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి
- ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



దివ్యాంగులతో కలిసి కేక్ కట్ చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి మిల్కా

ఎదులాపురం, డిసెంబర్ 28 : దివ్యాంగులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదిలాబాద్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. గురువారం ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ట్రెయినీ సహాయ కలెక్టర్ వికాస్ మోహతతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసరా పింఛన్లు, ఇళ్ల మంజూరు, బ్యాక్‌లాగ్ పోస్టులు, ఉచిత బస్సు సౌకర్యం వంటి వాటి గురించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. జిల్లాలో 7,070 మంది దివ్యాంగులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. ఆధార్ కార్డులో మార్పులు-చేర్పుల కోసం ప్రత్యేకంగా ఒక కేంద్రం మాట్లాడి ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ప్రజాపాలనలో సభల్లో దరఖాస్తులు సమర్పించవచ్చని సూచించారు. అనంతరం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మిల్కా కేక్ కట్‌చేసి తినిపించారు. దివ్యాంగులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రమేశ్ రాథోడ్, డీఆర్డీవో కిషన్, డీఈవో ప్రణీత పాల్గొన్నారు.

# దరఖాస్తు ఫారాలు ఉచితంగా ఇవ్వాలి..

- ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి..
- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- పలు ప్రజాపాలన కేంద్రాల సందర్శన



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఎదులాపురం, డిసెంబర్ 28 : దరఖాస్తుదారులకు ఉచితంగా ఫారాలు అందించాలని, ప్రతి కేంద్రం వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని రణదీవెనగర్, గాంధీనగర్ వార్డుల్లో నిర్వహించిన సభలు, గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తు నమోదులో అవసరమైన సూచనలు అందించాలని, ప్రతి దరఖాస్తును రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో కిషన్, డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాలు కల్పించాలని ధర్నా

నిర్మల్ టౌన్, డిసెంబర్ 28 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు గురువారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, పోషకాహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకుమార్, దినేశ్, శశాంక్, సాయిచరణ్, నిఖిల్, అఖిల్ పాల్గొన్నారు.